ఆగమ పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక భోజనం

- మల్లన్న ఆలయ ఈవో అన్నపూర్ణ

భోజన వసతిని ప్రారంభిస్తున్న కొమురవెల్లి ఆలయ ఈవో అన్నపూర్ణ

చేర్యాల, ఏప్రిల్ 18: రాష్ట్రంలోనే కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో ఆగమ పాఠశాల కొనసాగుతుందని, అందులో ఆగమ విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రత్యేకంగా భోజనం అందించేందుకు ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో అన్నపూర్ణ తెలిపారు. శుక్రవారం మల్లన్న క్షేత్రంలో ఆగమ శాస్త్ర విద్యార్థులకు ప్రత్యేకంగా భోజనం తయారు చేయించి వారికి సకాలంలో అందించేందుకు ఏర్పాట్లు చేయడంతో పాటు పనులను ఆమె ప్రారంభించారు. కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో విధులు నిర్వహించే ఏఈవో స్థాయి అధికారి నుంచి కింది స్థాయి వరకు డ్రెస్ కోడ్ అమలు చేసినట్లు తెలిపారు. ఆలయ ఉద్యోగులకు తెల్లరంగు గల డ్రెస్ నిత్యం వేసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మల్లికార్జున స్వామి క్షేత్రంలోని వీరశైవ ఆగమ పాఠశాల విద్యార్థులకు ప్రారంభమైన పరీక్షలను ఆమె పరిశీలించారు. తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆగమ సలహాదారు డాక్టర్ మహంతయ్యస్వామితో పాటు ఆలయ ఈవో అన్నపూర్ణ రాత పరీక్షలు, మౌఖిక పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, పర్యవేక్షకులు శ్రీరాములు, సురేందర్ రెడ్డి, అధ్యాపకులు వీరేశలింగం, ఆలయ సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రావు, మధుకర్ పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల వద్ద 163 సెక్షన్ అమలు

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 18: జిల్లాలో ఈనెల 20నుంచి ప్రారంభమయ్యే తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ టెన్త్, ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలు చేయనున్నట్లు సిద్దిపేట పోలీస్ కమిషనర్ బి.అనురాధ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. రేపటి నుంచి ఈ నెల 26వ తేదీ వరకు పరీక్షలు జరగనుండగా.. టెన్త్ కోసం 4 పరీక్షా కేంద్రాలు, ఇంటర్ కోసం ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టెన్త్ పరీక్షల కోసం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పారుపల్లి సిద్దిపేట, జడ్పీహెచ్ఎస్ గజ్వేల్, జడ్పీహెచ్ఎస్ బాలురు, చేర్యాల జడ్పీహెచ్ఎస్ గర్ల్స్, హుస్నాబాద్ కేంద్రాలు ఏర్పాటు చేయగా.. ఇంటర్ పరీక్షల కోసం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల సిద్దిపేట, ప్రభుత్వ ఉన్నత పాఠశాల సిద్దిపేట, ప్రభుత్వ ఉన్నత పాఠశాల గజ్వేల్, జడ్పీహెచ్ఎస్ బాలురు చేర్యాల, జడ్పీహెచ్ఎస్ హుస్నాబాద్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని సీపీ తెలిపారు.

163 సెక్షన్ అమలు

మహాత్మాజ్యోతిబా పూలే తెలంగాణ బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 6, 7, 8, 9వ తరగతిలో మిగిలిపోయిన సీట్ల కోసం ఈనెల 20న నిర్వహించే ప్రవేశ పరీక్షా కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలు చేయనున్నట్లు సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ తెలిపారు. ఈ పరీక్షల కోసం సిద్దిపేట పట్టణంలో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని, పరీక్షా సమయానికంటే గంట ముందే విద్యార్థులు కేంద్రానికి చేరుకొని ప్రశాంతంగా పరీక్ష రాయాలని ఆమె సూచించారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 18: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడిని దవాఖానకు తరలించి పోలీసులు మానవత్వాన్ని చాటుకున్నారు. సిద్దిపేట పాత బస్టాండ్ వద్ద నడుచుకుంటూ వెళ్తున్న 60 ఏండ్ల వృద్ధుడిని ద్విచక్ర వాహనదారుడు శుక్రవారం ఢీకొట్టగా అతడు తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు రాజేశ్, కమలాకర్ వెంటనే స్పందించి అతడిని 108లో దవాఖానకు పంపించి వృద్ధుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

వృద్ధుడికి సహాయం చేస్తున్న పోలీసులు

యాదవులకు వాటా దక్కేవరకూ పోరాటం

సిద్దిపేట, ఏప్రిల్ 18: అన్నిరంగాల్లో జనాభా నిష్పత్తి ప్రకారం యాదవులకు వాటా దక్కేవరకు రాజీలేని పోరాటం చేస్తామని యాదవ విద్యావంతుల రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ యాదవ్ అన్నారు. శుక్రవారం సిద్దిపేటలోని శ్రీకృష్ణ యాదవ ఫంక్షన్‌హాల్‌లో గొర్రె మల్లికార్జున్ యాదవ్ అధ్యక్షతన జరిగిన జిల్లా యాదవ విద్యావంతుల రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీసీల వాటా విషయంలో కాంగ్రెస్, బీజేపీ వివక్షపూరిత వైఖరి అవలంభించాయన్నారు. భూభారతి చట్టంపైన బాలనర్సు, మహిళా రిజర్వేషన్లపైన అచ్యుత యాదవ్, మూఢనమ్మకాలు, బాల్యవివాహాలు, పశుపాలకుల నాగరికతపైన శ్రీహరి తమ అభిప్రాయాన్ని పంచుకున్నారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని విస్తరించి నూతన కమిటీని ప్రకటించారు. కార్యక్రమంలో రాజేశ్, రాజు, మల్లయ్య, రాములు, జిల్లా అధ్యక్షుడు ఐలయ్య, చంద్రం, శ్యామ్, రాము, చంద్రశేఖర్, రాజు, రవీందర్, రాజేశ్వర్, నూనె కుమార్, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకట్ యాదవ్

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి

కొమురవెల్లి, ఏప్రిల్ 18: ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలని సీపీఎం మండల కార్యదర్శి తాడూరు రవీందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ఐనాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీపీఎం నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్కెట్‌లో ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం పడితే ధాన్యం తడిచిపోయే పరిస్థితి ఉందని, వెంటనే ధాన్యం కొనుగోలు చేసి రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేయాలన్నారు. కార్యక్రమంలో తేలు ఇస్తారి, ఎల్లయ్య, యాదగిరి, నర్సమ్మ, రాజు పాల్గొన్నారు.

ఐనాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

వీడీసీలను తక్షణమే నిషేధించాలి

చేర్యాలలో వీడీసీ కమిటీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కొమురవెల్లిలో వీడీసీ కమిటీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న గౌడసంఘం నాయకులు

చేర్యాల, ఏప్రిల్ 18: నిజామాబాద్ జిల్లాలో చట్ట విరుద్ధంగా ఏర్పాటైన వీడీసీలను తక్షణమే నిషేధించాలని కల్లుగీత కార్మిక సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఎస్ఎఫ్ఐ, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద తాళ్లరాంపూర్ వీడీసీ దిష్టిబొమ్మను కుల, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొంగరి వెంకట్‌మావో మాట్లాడుతూ తాళ్లరాంపూర్ గీత కార్మికులపై సాంఘిక బహిష్కరణ ఎత్తివేయాలని, గౌడ మహిళలను గుడి నుంచి గెంటివేసి, ఈత చెట్లను తగలబెట్టిన వీడీసీ సభ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేజీకేఎస్ మండల అధ్యక్షుడు నర్సింహులు, నాయకులు కనకయ్య, లింగం, గణేశ్, రాములు, మల్లేశం, రంజిత్‌రెడ్డి, ప్రదీప్, వెంకటయ్య, రాములు, ఐలయ్య, ప్రసాద్, చందు, రమేశ్, కృష్ణమూర్తి, శ్రీహరి పాల్గొన్నారు.

కొమురవెల్లిలో...

కొమురవెల్లి, ఏప్రిల్ 18 : నిజామాబాద్ జిల్లా వెలికట్ట మండలం తాళ్లరాంపూర్‌లో గౌడ మహిళలను ఆగౌరపర్చిన వారిపై చర్యలు తీసుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం మండలాధ్యక్షుడు రాజుగౌడ్ డిమాండ్ చేశారు. కొమురవెల్లిలో (వీడీసీ) విలేజ్ అభివృద్ధి కమిటీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఏడు నెలల నుంచి గౌడ కుటుంబాలపై వివక్ష చూపుతున్న కమిటీ సభ్యులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గౌడసంఘం నాయకులు విష్ణుమూర్తి, నర్సింహులు, శ్రీకాంత్ గౌడ్, కనకయ్యగౌడ్ పాల్గొన్నారు.

రజతోత్సవ సభను జయప్రదం చేయాలి

బెక్కల్‌లో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చిన్నకోడూరులో మాట్లాడుతున్న యువజన విభాగం నాయకులు

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 18: బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని ధూళిమిట్ట మండలంలోని బెక్కల్ మాజీ ఎంపీటీసీ నలుగొప్పుల రేణుకా రాములు కోరారు. శుక్రవారం గ్రామంలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్లను బీఆర్ఎస్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు బీఆర్ఎస్ నాయకులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు మేడిచెల్మి రాములు, మాజీ సర్పంచ్ కంకణాల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ గుండె చంద్రయ్య, ఆరె జగన్, మన్నె లింగారెడ్డి, సుదర్శన్, బొల్లు గట్టయ్య, రాగుల పరశురాములు పాల్గొన్నారు.

కొండాపూర్‌లో..

వరంగల్ జిల్లాలో ఈ నెల 27న చేపట్టనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రజలు లక్షలాదిగా తరలిరావాలని బీఆర్ఎస్ ధూళిమిట్ట మండల అధ్యక్షుడు మంద యాదగిరి కోరారు. శుక్రవారం మండలంలోని కొండాపూర్‌లో బీఆర్ఎస్ నాయకులు రజతోత్సవ సభ వాల్‌పోస్టర్లను గోడలకు అతికించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాదావత్‌రేఖా శ్రీనివాస్, నాయకులు ఎనగందుల యాదగిరి, గడిపె వెంకటయ్య, బోజ్యనాయక్, లింగాల సంపత్, జాటోత్ రమేశ్, మంద రాజు, గడిపె నరేశ్, కనకయ్య, బాకి సాగర్, మొగిలి పాల్గొన్నారు.

చేర్యాలలో...

చేర్యాల, ఏప్రిల్ 18: వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించే భారీ బహిరంగ సభకు ఇంటికి ఒకరు తరలిరావాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అంకుగారి శ్రీధర్ రెడ్డి, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, పట్టణ కార్యదర్శి బూరగోని తిరుపతిగౌడ్ కోరారు. మున్సిపాలిటీలోని మొదటి వార్డులో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించడంతో పాటు వాల్‌పోస్టర్లు అతికించారు. అనంతరం అంకుగారి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ అధికార పార్టీ ప్రజలను మోసం చేస్తున్నదని, హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతున్నదని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు మంచాల కొండయ్య, బూరగోని వాణి, ఆకుల బాలరాజు, బండి నర్సింహులు, భూమిగారి రాజేందర్, గుడాల నర్సయ్య, కూరెళ్ల యాదగిరి, బండి కళావతి,కూరెళ్లి సరస్వతి, బండయ్య నర్సవ్వ, బూరగోని జయలక్ష్మి, ఆకుల సత్యలక్ష్మి, బూరగోని సురేశ్‌గౌడ్, నరిగే బాలయ్య, వజ్రమ్మ పాల్గొన్నారు.

సభకు యువత తరలిరావాలి

చిన్నకోడూరు, ఏప్రిల్ 18: వరంగల్ జిల్లాలో ఈనెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పెద్ద ఎత్తున యువత తరలిరావాలని ఆ పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు గుండెల్లి వేణు, బీఆర్ఎస్‌వీ మండల అధ్యక్షుడు గుజ్జ రాజు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సూచనలు మేరకు సిద్దిపేట నియోజకవర్గం పరిధిలో విద్యార్థి యువత పాదయాత్ర చేస్తారన్నారు. ఈనెల 25న ఉద్యమ స్ఫూర్తికి వేదిక అయిన రంగదాంపల్లి అమరవీరుల స్థూపం నుంచి ప్రారంభమయ్యే పాదయాత్ర 27వ వరకు సభాప్రాంగణానికి చేరుకుంటుందన్నారు. సమావేశంలో కాముని ఉమేశ్ చంద్ర, విద్యార్థి విభాగా నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చెట్టుపల్లి భానుచందర్, యువ నాయకులు ముష్మీర్ సాయి, దేవేందర్‌రెడ్డి, మిట్టపల్లి సుధాకర్, కొలను రఘువర్మ, మన్నె ఆనంద్, గనాగోని శ్రవణ్‌గౌడ్, కుంభాల చంద్రశేఖర్, బెజ్జంకి తిరుపతి, సందబోయిన నాగరాజు, పరశురాములు, పడిగలింగం, ఎలుక అనిల్, జానకి చందు, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సభను జయప్రదం చేయాలి

కోహెడ, ఏప్రిల్ 18: వరంగల్ జిల్లాలో ఈనెల 27న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తలపెట్టిన రజతోత్సవ సభను జయప్రదం చేయాలని బీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని తంగళ్లపల్లిలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. తెలంగాణ కోసం ఉద్యమించిన తరహాలో అధికసంఖ్యలో జనం తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేర్యాలలో పోస్టర్ అతికిస్తూ ప్రచారం చేస్తున్న శ్రీధర్‌రెడ్డి తదితరులు

కోహెడ: సమావేశంలో మాట్లాడుతున్న కర్ర శ్రీహరి

కొండాపూర్‌లో వాల్‌పోస్టర్ అతికిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నేడు బీఆర్ఎస్ సన్నాహక సమావేశం

రాయపోల్, ఏప్రిల్ 18: ఎల్కతుర్తి సభను జయప్రదం చేయడానికి శనివారం జీఎల్ఆర్ గార్డెన్‌లో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరశర్మ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ... ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో జరగనున్న సభకు సంబంధించి ఏర్పాట్ల కోసం చర్చించేందుకు సన్నాహక సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దుబ్బాక నియోజకవర్గలోని గులాబీ శ్రేణులు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

స్లాట్ బుకింగ్ విధానం రద్దు చేయాలి

గజ్వేల్, ఏప్రిల్ 18: ప్రభుత్వం తీసుకువచ్చిన స్లాట్ బుకింగ్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం బంద్ నిర్వహిస్తున్నట్లు గజ్వేల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని దస్తావేజు లేఖరుల సంఘం నాయకులు హమీద్, దనుశ్‌కుమార్, నవీన్‌కుమార్, మాధవ రావు, మల్లేశం, నరేందర్, ప్రసాద్, మసూద్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. శనివారం నిర్వహించే బంద్ కార్యక్రమానికి ప్రజలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు మద్దతు ఇవ్వాలని వారు కోరారు.

హోంగార్డుకు చేయూత

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 18: ట్రాఫిక్ హోంగార్డు బాలకిషన్‌కు పోలీసులు చేయూత నందించారు. సిద్దిపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న హోంగార్డు బాలకిషన్ కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. అతడి భార్య బ్లడ్ గ్రూపు మ్యాచ్ అవుతుండడంతో కిడ్నీ ఇవ్వడానికి ఆమె ముందుకు వచ్చింది. సర్జరీకి వెళ్తున్న బాధితుడికి ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్, సీఐ ప్రవీణ్ కుమార్ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఎస్సై గోపాల్‌రెడ్డి, ఏఎస్సై రఘు, జిల్లా హోంగార్డు సంఘం అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, శాకీర్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

తొగుట, ఏప్రిల్ 18: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో విద్యార్థి మృతిచెందిన ఘటన తొగుట మండలం తుక్కాపూర్‌లో చోటు చేసుకుంది. శుక్రవారం తొగుట ఎస్సై రవి కాంతారావు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చిక్కుడు స్వామి చిన్న కుమారుడు సాయిప్రణీత్(12) ఆరో తరగతి చదువుతున్నాడు. ఈనెల 17న గ్రామంలో పోచమ్మగుడి వద్ద ఉత్సవాలు ఉన్నందున డెకరేషన్‌లో భాగంగా రంగు రంగుల విద్యుత్‌లైట్లు ఏర్పాటు చేశారు. ఇదే క్రమంలో గురువారం రాత్రి సాయి ప్రణీత్ ఆడుకుంటూ విద్యుత్ లైట్లకు ఏర్పాటు చేసిన ఇనుప స్తంభాన్ని ముట్టుకోవడంతో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. బాలుడి తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చేబర్తిలో రైతు...

మర్కూక్, ఏప్రిల్18: మండల పరిధిలోని చేబర్తిలో విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఎలిమెల పోచయ్య (50) వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. బోరుమోటరు మురాయించడంతో గురువారం రాత్రి మరమ్మతు చేస్తున్న సమయంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మృతుడి కొడుకులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న ప్రజాప్రతినిధులు శుక్రవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

జాన్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలి

సిద్దిపేట, ఏప్రిల్ 18: దళిత బిడ్డ మల్లీశ్వరి ఆత్మహత్యకు కారణమైన జాన్‌రెడ్డిపై మర్డర్ కేసు నమోదు చేయాలని మాదిగ జాగృతి సంఘం జిల్లా కన్వీనర్ వేముల మల్లికార్జున్ మహారాజ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం బొక్కమంతలపాడుకు చెందిన దళిత బిడ్డ మల్లీశ్వరిని పెండ్లి చేసుకుంటానని నమ్మించి సహజీవనం చేసి ఆమెను మోసం చేసిన జాన్‌రెడ్డి, అతడి కుటుంబ సభ్యులపై వెంటనే మర్డర్ కేసు నమోదు చేసి తక్షణం అరెస్టు చేయాలన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. జాన్‌రెడ్డి, అతడి కుటుంబ సభ్యులను కఠినంగా శిక్షించాలన్నారు.

చోరీకి యత్నం.. పట్టుబడ్డ దొంగ

చేర్యాల, ఏప్రిల్ 18: ఆలయంలో చోరీకి యత్నించిన దొంగను స్థానికులు పట్టుకున్నారు. పట్టణంలోని పెద్ద చెరువు కట్ట వద్ద నూతనంగా నిర్మించిన మడలేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం చోరీకి యత్నించిన దొంగను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులకు సమాచారం అందించడంతో దొంగను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కోహెడ, ఏప్రిల్ 18 మండలంలోని బస్వాపూర్ ఉన్నత పాఠశాలలో 1989-90లో టెన్త్ పూర్తిచేసిన విద్యార్థులు శుక్రవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకొన్నారు. ఉపాధ్యాయులను సన్మానించారు. అంతకుముందు సహపంక్తి భోజనం చేశారు. తీపిగుర్తులను నెమరువేసుకొని ఎంజాయ్ చేశారు.

దాడికి పాల్పడినవారిపై కేసు నమోదు

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 18: దాడికి పాల్పడిన ఇద్దరిపై మద్దూరు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. మద్దూరు మండలం లద్నూర్‌కు చెందిన కర్రె రాజశేఖర్ శుక్రవారం తన వ్యవసాయ పొలం వద్ద పనులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. మార్గమాధ్యలో లద్నూర్-మర్నాముల కాలువ వద్ద చిలువేరు రాజు, చిలువేరు రంజిత్‌కుమార్ రాజశేఖర్ బండి అడ్డగించి పాతకక్షలను మనస్సులో పెట్టుకొని కర్రలతో దాడి చేశారు. రాజశేఖర్ తండ్రి తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్ తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మాట్లాడుతున్న ఎస్సై పరశురాములు

మిరుదొడ్డి, ఏప్రిల్ 18: మూఢనమ్మకాలను నమ్మి ఆర్థికంగా ఇబ్బందులు పడవద్దని మిరుదొడ్డి ఎస్సై పరశురాములు సూచించారు. గురువారం రాత్రి మండలంలోని చెప్యాలలో పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామా ల్లో అనుమానితుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

ఎస్సీ విద్యార్థులకు ప్రవేశం కల్పించాలి

విద్యా కమిషన్ చైర్మన్ మురళికి వినతిపత్రం అందజేస్తున్న శంకర్

గజ్వేల్, ఏప్రిల్ 18: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఎస్సీ విద్యార్థులకు యథావిధిగా ఒకటో తరగతిలో ప్రవేశం కల్పించాలని కోరుతూ డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ శుక్రవారం విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళిని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఒకటో తరగతి నుంచి కాకుండా మూడో తరగతి నుంచి ప్రవేశం కల్పించేందుకు యాజమాన్యం కుట్ర చేస్తుందని ఆరోపించారు. ఒకటో తరగతి నుంచి కాకుండా మూడో తరగతి నుంచి ప్రవేశం కల్పిస్తే సామర్థ్యాలు ఎలా తెలుస్తాయని, ఎలా పోటీ పడతారని ప్రశ్నించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వడంతో పాటు హాస్టల్ వసతి కల్పించాలని డిమాండ్ చేశారు.

అకాల వర్షం.. అపార నష్టం

దుబ్బాకలో తడిసిన ధాన్యం

చేర్యాల, ఏప్రిల్ 18: చేర్యాల, కొమురవెల్లి మండలాల్లోని వివిధ గ్రామాల్లో శుక్రవారం వర్షం కురిసింది. ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లోని వివిధ గ్రామాల్లో తేలికపాటి వర్షం కురిసింది. సాయంత్రం ఒక్కసారిగా ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చేర్యాల వ్యవసాయ మార్కెట్ యార్డులో గన్నీ బ్యాగుల్లో ఉన్న ధాన్యం, పోతిరెడ్డిపల్లి ఐకేసీ కేంద్రంలో ఉన్న ధాన్యం తడిసింది. పిడుగుపాటకు గుడిసె వెంకటయ్య, గడ్డం నరేశ్ పాడిగేదెలు మృతిచెందాయి. కొమురవెల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోకి భారీగా నీరు చేరడంతో ధాన్యం తడిచిపోయింది. మామిడి తోటలకు తీవ్ర నష్టం జరిగినట్లు ఆయా గ్రామాల రైతులు తెలిపారు.

దుబ్బాకలో ...

దుబ్బాక, ఏప్రి18: దుబ్బాకలో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. అకాల వర్షానికి దుబ్బాక మార్కెట్‌యార్డులో వరి ధాన్యం తడిసింది. దుబ్బాక పట్టణంతోపాటు హబ్షీపూర్, చీకోడు, ఆరెపల్లి, పోతారం గ్రామాల్లో మామిడికాయలు రాలిపోయాయి. రోడ్లపై చెట్లు పడిపోయాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి.

చేర్యాలలో ఇబ్బందులు పడుతున్న రైతులు

హుస్నాబాద్ హోలీబీలీవర్స్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు